# బంగారం తయారుచేసే రహస్యం బయటపడితే రాజద్రోహమా?

కనుకుంట్ల నరేంద్ర కథ

# స్వర్ణయోగం

కాకతీయ సామ్రాజ్యాన్ని మహా పరాక్రమవంతుడు ప్రతాపరుద్ర చక్రవర్తి పాలిస్తున్న రోజులవి.

బాల భానుడు ఆకసమునిండా సింధూర వర్ణము పులుముతుంటే పూజా మందిరములో దేవ దేవుని సింధూర తిలకముతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాదులర్పించి భగవన్నామ స్మరణలో ఏకాగ్రచిత్తులై ఉన్నారు ఆచార్యులవారు. వెనుక ఏదో అలికిడి విని ఒక్క క్షణం నామస్మరణను ఆపి మౌనం వహించారు. వచ్చినది సతీమణియని ఆయనకు తెలుసు. పూజా మందిరములోనికి ఎంతో ముఖ్యమైన కార్యముంటేనే గాని వెళ్ళదామె. ఆచార్యుల నిష్ఠా గరిష్ఠలు ఆమెకు సుపరిచితములైనవి. ఆచార్యులు జపము ఆపి మౌనం వహించారంటే వచ్చిన పని తెలియచేయుమనే వారి సంకేతాన్ని గ్రహించినట్లుందామె.

"మహారాజుగారి వార్తాహరుడు మీ కోసం వేచి ఉన్నాడు". ఎంత మృదువుగా పలికినా ఆమె కంఠములో భయం ధ్వనించింది. క్షణం ఆలసించకుండా అక్కడి నుండి నిష్క్రమించింది.

ఆచార్యులవారి భృకుటి క్షణం ముడివడి వెంటనే ముఖంలో ప్రశాంతత వెలకొంది. మహారాజు గారు ఆకస్మికముగా కబురు పంపించారంటే ముఖ్యమైన రాచకార్యమై యుంటుందని ఊహించారాయన. రాజ వైద్యుడూ రాజ పురోహితుడూ ఆచార్యుల వారే కనుక ఎప్పుడు వారి అవసరముంటుందో వారికే అమూహ్యమైన విషయము.

జపములో వేగిరపడక యధాలాపముగా



పూజ ముగించి బయటకు వచ్చారాయన. వచ్చినవాడు మామూలు వార్తాహరుడు కాదనీ, ఆస్థాన అంతరంగిక వేగుడనీ గ్రహించి చిరునవ్వు నవ్వారాయన.

"శ్రీ శ్రీ శ్రీరాజ గోపాలాచార్యుల వారికి నమస్కారములు" అని ఆ వేగుడు వినయముగా ప్రణమిల్లాడు.

"ఆశీర్వాదములు గరుడ చక్తా! ... ఇంత

ఆకస్మికముగా నీవే స్వయంగా రావడము నన్ను ఆశ్చర్య పరుస్తున్నాయి... విశేషాలేమిటి?" అన్నాడా వేగుని కళ్ళల్లోకి నిశితముగా చూస్తూ.

"మహారాజుగారు సత్వరమే మిమ్మల్ని తోడ్కొని రమ్మన్నారు. విషయము మీకు పూర్వమే తెలుసని సెలవిచ్చారు."

అతని సమాధానం ఆచార్యులను ఆశ్చర్య పరచింది. "సరే వస్తున్నాను!" అంటూ భవ నాంతరములోనికి నిష్క్రమించి వస్త్ర ధారియై క్షణములో వేగుని ముందు ప్రత్యక్షమయ్యారు. కాషాయాంబరము మెయినిండా చుట్టి పట్టువస్త్రాన్ని శిరస్త్రాణముగా ధరించి లలాటమందు సింధూర చందన తిలకము దిద్ది, గంభీరముగా అడుగులు వేస్తూ అశ్వద్వయము కూర్చిన శకటము సమీపించి ఆసీనులయ్యారు. ఆచార్యులు కూర్చున్నదే తడవుగా సారధి అశ్వాల్ని అదలించి వాయు వేగముతో శకటాన్ని త్రోలసాగాడు. ఆ వాయు వేగానికి ఆచార్యుని కాషాయాంబరము కేతన సదృషమై రెపరెప లాడుతూ గాలిలో ఎగర సాగింది.

ఉదయ భానునిపై మబ్బు తెర క్రమ్మినట్లు మహా తేజోవంతమైన ఆచార్యుని మోముపై విషాద ఛాయలేవో క్రమ్ముకున్నాయి, ముడివడిన ఆయన భృకుటి చూపరులకు ప్రశ్నార్థకముగా నిలిచి గంభీరతను సంతరిస్తున్నది. ఆయన ఆలోచనలు శకట వేగాన్ని ఎప్పుడో అధిగమించి రాజప్రాసాదాన్ని చేరుకున్నాయి.

ఏ విషయముపై మహారాజు తనకు కబురు పంపాడో తాను తరచి ప్రశ్నించకుండా ఈ వేగుడు విషయము తనకు సుపరిచితమేనని ఒక్క మాటతో తప్పుకున్నాడు.

సుపరిచితవిషయాలైతే అసందర్భముగా వార్తాహరుడు కాసీ, ఈ ఆంతరంగిక వేగుడెందుకు వస్తాడు?

ఈ వేగుని వాలకం చూస్తుంటే తన మనస్సు కీడు శంకిస్తున్నది. గతమువంతా స్మృతిలోకి తెచ్చుకున్నా, చెప్పుకోదగిన ఏ సంఘటనా స్ఫురించడము లేదు. పూజా మందిరములో వామ నేత్రము చలించడము గుర్తుకు రాగానే ఆచార్యుని మనస్సు ఆందోళనకు గురైనది. మనస్సులోనే తిథి, వార, నక్షత్రాలను గణించుకున్నాడు. వెను వెంటనే ఆయన వదనం మ్లానమై పోయింది. ఆయన ముఖంలో ప్రతిఫలిస్తున్న భావాలు గ్రహించి గరుడవక్షుడు విస్తుపోయాడు. భూత భవిష్యత్ వర్తమాన కాలములను క్షణంలో ఊహించగల ఆచార్యుని జ్యోతిష్య ప్రతిభా సంపత్తి అతనికి తెలియనిది కాదు. జరుగబోయే విషయం తనకు ప్రతికూలమని ఆచా ర్యుడెలా ఊహించాడోనని ఆ వేగుని ఆశ్చర్యం.

శకటము రాజప్రాసాద ముఖద్వారము వద్ద ఆగింది. ఆలోచనా మందిరమది. శకటమును వేగముగా అవరోహించి సభ నాంతర్ముఖులయ్యారు ఆచార్యులు. ఆయన ఉనికి గ్రహిస్తూనే మహారాజు కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్ర చక్రవర్తి ఆయన మహా మంత్రి లేచి ఆచార్యులకు నమస్కరించారు.

"ఆశీర్వాదములు!.... ఇంత ప్రాతఃకాలమే మాకు కబురంపడానికి కారణ మూహించలేకుండా ఉన్నాను" అంటూ ఆసీనులయ్యారు. కొన్ని క్షణాలు ముగ్గురూ నిశబ్దంగా ఉండిపోయారు. మహామంత్రి ఆచార్యునుద్దేశించి గంభీరముగా ప్రశ్నించాడు "గరుడ చక్షుడు మీకు విషయము తెలిపే ఉంటారనుకుంటాను" ఆయన కంఠం లోని తీక్షణతను గ్రహించారు ఆచార్యులు. "గరుడ చక్షుడు మీ ఆజ్ఞలకు మీరడనీ మీకూ, నాకు తెలుసు. విషయము నాకు సంబంధించినదని గ్రహించగలను మహామంత్రీ" అన్నాడు గంభీరముగా.

ఆ మాటలకు మహారాజు ఓష్ఠద్వయముపై చిరుహాసము మెరిసి అదృశ్యమైంది. ఆచార్యుని ప్రతిభ ఆయనకు బాల్యమునుండే తెలుసు. కానీ మహామంత్రి పదవీ బాధ్యతలలాంటివి. ఆయన వేగున్ని ఆచార్యుని వద్దకు పంపుతూ ఏ విషయమూ ప్రస్తావించవద్దని ఆజ్ఞాపించాడు. ఆచార్యుని ముందు బలహీన మనస్కుడై గరుడ చక్షుడేమైనా విషయ ప్రస్తావన చేశాడేమోననే సందేహముతో ఆచార్యున్నిలా ప్రశ్నించా డాయన.

"విషయము మీకు సంబంధితమన్నది నిజము. ప్రస్తుతము మీకు బందితులైన ఇద్దరు ఖైదీల గురించి తెలుపవలసి వచ్చింది"

"ఖైదీలా!" ఆచార్యుని నేత్రాలు విశాలమయ్యాయి.

"అవును"

"ఎవరు వాళ్ళు?"

"రేపు సభా మండపములో మీరు వారిని చూడవచ్చు. వారి నేరాన్ని విచారించి రేపు శిక్ష విధిస్తున్నాము" అన్నాడు మంత్రి.

"వాళ్ళు చేసిన నేరమేమిటి?" ఉత్కంఠతో ప్రశ్నించాడు ఆచార్యులు.

"రాజద్రోహం, దేశ ద్రోహం కన్నా పెద్ద నేరము"

ఆచార్యులు విస్మయంగా మహారాజు వైపు ప్రశ్నార్థకముగా చూశారు.

"అవును ఆచార్య! క్షమించరాని నేరము. మన రాజ్యములో సువర్ణ విద్య గురించి తెలిసిన వారు మీరొక్కరే. ఈ రోజు బంధితులైన ఖైదీలు చాలా రోజుల నుండి



## అరెస్టు

ఇంటర్వ్యూ కెళ్ళాడు సత్యమూర్తి.

"ఇంతకు ముందెప్పుడయినా పోలీసులు మిమ్ము అరెస్టు చేశారా?" అడిగాడు ఇంటర్వ్యూ అధికారి.

"లేదండి..." చెప్పాడు సత్యమూర్తి.

"అయితే మీ కాండక్ట్ చాలా మంచిదన్నమాట" అన్నాడు అధికారి.

"కాండక్ట్ కాదండి.. నా రన్నింగ్ చాలా మంచిదండి" చెప్పాడు సత్యమూర్తి

—కె.వెంకటరామ అక్కయ్య
(కంకిపాడు)

సువర్ణాన్ని చేస్తున్నారు. అంతేకాదు. వాళ్ళు చేసిన మరొక ఘోరాపరాధము మన దేశపు సువర్ణ నాణెములను అచ్చుపోసి చేస్తున్నారు ...'' అన్నారు మహారాజు.

"ఎవరు మహారాజా వాళ్ళు?" ప్రశ్నించారు ఆచార్యులు.

''ఇద్దరు బ్రాహ్మలు ఆచార్య!'' గంభీరముగా పలికాడు మహామంత్రి. ఆ మాటలకు అప్రతిభుడయ్యాడు ఆచార్యులు.

''గరుడ చక్షుడు ఈ విషయం మాకు తెలిపినప్పుడు మేము ముందు విశ్వసించలేదు. కాని మనవాళ్ళు పరిశోధించాక ఆ బ్రాహ్మలు ఇంటిలో వివిధ వన మూలికలూ రసాయనిక ద్రవ్యములు, తాళపత్ర గ్రంథములు లభించాయి." చిన్న మందసము తెరచి అందులోనుండి శిథిలావస్థలో నున్న ఒక తాళపత్ర గ్రంథాన్ని తీసి ఆచార్యులవారికి సమర్పించారు. వణుకుతున్న హస్తాలతో దాన్ని అందుకొని కళ్ళకు అద్దుకున్నారు ఆచార్యులు. ఆయన కళ్ళు జ్యోతుల్లా వెలిగాయి. ఏవేవో ఆలోచనా తరంగాలు ఆయనను ఉక్కిరి బిక్కిరి చేశాయి. మనస్సులో జ్ఞాపకాల పొరలువిచ్చుకుంటున్న అనుభూతి. తన్మయత్వమో మూర్ఛయో తెలియని స్థితి ఆయనను ఆవరించింది. పెదవులు విడివడి కూడా పలకలేక పోతున్నాయి. ఆనంద్ధమో దుఃఖమో తెలియని స్థితిలో ఆయన కళ్ళనుండి రెండు భాష్పములు మాత్రము ఆ పవిత్ర గ్రంథాన్ని తడిపాయి. ఆప్యాయముగా ఆ గ్రంథాన్ని తడుముతూ కొన్ని పత్రాలు నెమ్మదిగా విప్పి చదివారాయన.

''మహారాజా ఈ గ్రంథము ఆచార్య నాగార్జున ప్రణీతము. ఇది మా పూర్వీకుల వద్ద ఉండేది. మా పితామహుడు ఈ గ్రంథము పఠించి ఆమూలాగ్రము జీర్ణించుకున్నారు. చివరకు ఈ గ్రంథము గురించి ఆనాటి వైద్య శ్రేష్ఠుల పెనుగులాటలో అపహరించబడింది. ఈ గ్రంథమెంత పవిత్రమైనదో దీని చరిత్ర అంత హీనాతి హీనమైనది మహారాజా? ఇది తిరిగి నాకు లభ్యమైనందుకు ఆనందము పట్టలేక పోతున్నాము." మహామంత్రి మందహాసము చేశాడు.

''ఈ గ్రంథము మీ పితామహులదే కావచ్చు. ఆయన కంటె ముందు ఈ గ్రంథము మా ఆస్థానములో ఉండేది ... కాని అది అపహరింపబడింది....''అన్నాడు మహామంత్రి.

ఆచార్యుల వదనం మ్లానమై పోయింది ... ''మీ అభిప్రాయం నా కర్థమై పోయింది మహామంత్రీ ... ఏ ఆధారముతో మీరలా నిర్ణయించారో తెలుసుకోవచ్చా!'' అన్నాడు తీక్షణముగా చూస్తూ.

''ఆధారాలు చాలా ఉన్నాయి ఆచార్య! ఈ రోజు బంధితులైన ఖైదీలు ఎవరో కాదు... మీ వంశస్థులే... దీని చరిత్ర వాళ్ళు చెప్పారు... మన ఆస్థానములో మీ పితామహుడు పనిచేసిన నాటి చరిత్ర పుటల్లోనూ ఆధారాలున్నాయి .... మీ పితామహుడు స్వార్థానికి లోనయి పతనమయ్యారు.... ఆయన కోటలో

పనిచేసినా బయటి వారితో సంబంధాలు పెట్టుకున్నారు.... ఈనాడు ... మీరు.... ఈ ఖైదీలతో ....”

“మహామంత్రీ!” గర్జించాడు ... ఆచార్యులు... ఆయన కంఠం భవ నాంతర్భాగములో మారు మ్రోగింది ... ఆవేశముతో ఆయన దవడలు బిగుసుకున్నాయి. ముఖం అరుణ వర్ణములో మారింది. నాసికా రంధ్రాలు విశాలమై ఆవేశంతో ఉచ్ఛ్వాస నిశ్వాస్వల వేగం పెరిగింది. మహామంత్రి తల వంచుకున్నాడు.

“మీరు అపార్థము చేసుకొని ఆవేశ పడవద్దు ఆచార్యా! రాజ్య పటిష్టత ఆర్థిక పరిస్థితిపై ఆధారపడి 'ఉంటుందని మీకు తెలుసు. మీ పితామహుని కాలమునుండీ మన ఆస్థానములో చేయుచున్న సువర్ణమంతా ప్రజా శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నాము. మన రాజ్యములో సువర్ణమును చేయగలవారు మీరొక్కరే. మరెవ్వరికా అవకాశము లేదు. ఈ నాడు మరెవరో చేశారు కనుక మిమ్మల్ని ప్రశ్నించవలసి వచ్చింది” ... అన్నాడు మహారాజు అనునయిస్తున్న ధోరణిలో.

“మీరు ప్రశ్నించే విధము మాపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నది. మీరు సెలవిచ్చినట్లు 'సువర్ణ విద్య' నాకొక్కడికే తెలుసునన్న విషయము కేవలము భ్రమ మహారాజా! ఎందరో మహానుభావులు ఈ విద్యలో గెలుపు సాధించారు. వేదాలు పుట్టినప్పటి నుండి ఈ విద్యలో రహస్య పరిశోధనలు చేశారు వైద్య శ్రేష్ఠులు. యజుర్వేదములో ఆయుర్వేదము ఒక భాగము. దేవ దానవ సమరములో గాయపడిన దేవతలకు అశ్వినీ దేవతలు చికిత్స చేశారు. 'మృత సంజీవని' అనే మూలికతో వారు చనిపోయిన దేవతలను బ్రతికించేవారు. ఈ విషయమై పురాణాల్లో ఎన్నో గాథలున్నాయన్న విషయము మీకు సుపరితమే. మహారాజా సువర్ణము చతుర్విధములు. ఖనిజము, ఔషదీసిద్ధము, రసాయనికము, అను త్రివిధములే కాక నాల్గవది “మేరు పర్వతము”. ఈ గిరి శిలాయుతము కాదు. స్వర్ణమయము. ఈ బ్రహ్మాండములో

## చంద్రగ్రహణం



క్రిస్టోఫర్ కొలంబస్ పేరు వినని వారుండరు? ఆయన మంచి ఖగోళ శాస్త్రవేత్త! ఆయన ఖగోళ శాస్త్రవేత్తగా స్థిర పడ్తున్న సమయంలో జమైకాలో ఉన్నప్పుడు ఆయనను ప్రాంతీయులు అనేక విషయాలలో ఇబ్బంది పెట్టేవారు? దాంతో దిక్కు తోచని కొలంబస్‌కు ఆ మర్నాడు వచ్చే చంద్రగ్రహణం గుర్తుకువచ్చింది. వెంటనే జమైకా వారిని బెదిరిస్తూ తనకు సహాయం చేయకపోతే ... మర్నాడు చంద్రుడు కన్పించకుండా చేస్తాననీ... అలాచేసే సరైన సమయంకూడా గుణించి చెప్పాడట. మర్నాడు అలాగే జరగటంతో అందరూ బెదిరిపోయి కొలంబస్‌కు బ్రహ్మరథం పట్టారట!

జూపిటర్.

ఎచ్చట గలదో మానవులకు దుస్సాధ్యమైనది. కేవలము దేవతలకే అది సాధ్యమైనది. ఆస్థానములో నేను చేస్తున్నది రసాయనిక సిద్ధమైన సువర్ణము. 'స్వర్ణయోగములు'' చాలా రహస్యమైనవి. వాని పరిశోధనలో ఎందరో తమ జీవితాలను అంకితము చేశారు. కొందరు సాధించారు. రసాయనిక పద్ధతిలో పాదరసాన్ని శుద్ధిచేసి దాని అణుశక్తిని పెంపొందించాలి. దానిని 'శతవేది' 'సహస్రవేది' అను ద్వివిధములుగా రూపొందించవచ్చు. ఒక తులము రసభస్మము (శతవేది)తో వంద తులముల రాగిని కాని పాదరసమును కాని స్వర్ణముగా మార్చవచ్చు. అలాగే సహస్రవేదితో వేయి తులముల స్వర్ణముగా మార్చవచ్చు. ప్రస్తుతము నేను ప్రయోగిస్తున్నది— సహస్రవేది. సహస్రవేదిగా మారిన రసములో నూరు తులముల బంగారము జారణ చేసినా (జీర్ణము చేసినా) దాని బరువు తులము మాత్రమే ఉంటుంది. దాని బరువు పూర్వ స్థితిని మారదు. దాని అణు శక్తి అలాంటిది.

మహారాజా! పాదరసము వినియోగించకూడా రాగిని స్వల్ప పరిమాణములో తీసుకొని మూలికలతో స్వర్ణముగా మార్చవచ్చు. అందుకు చిత్రమాలము (ఎరుపు), కృష్ణనిర్గుండి (నల్లవావిలి) మొదలగు ఎన్నో మూలికలు నాగార్జునిని 'రసతంత్రములో' వ్రాయబడ్డాయి. కాని ఇవేవీ 'శతవేది', 'సహస్రవేది'ల విధముగా అధిక పరిమాణములో సువర్ణాన్ని సిద్ధింపలేవు. సాధువులు, సంతులు, బౌద్ధభిక్షకులు, యోగులు ఎందరో రహస్యముగా తమ అవసరముల నిమిత్తము చేయుచున్నారు. వారిని మనం గుర్తించలేము మహారాజా. దేశదేశాలు పర్యటిస్తుంటారు వారు.

ఆచార్య నాగార్జునుడు మృత్యువునే సాధించాడు. మానవుని ఆయుః ప్రమాణాన్ని పెంచే ఔషధములున్నాయి. అలాంటి రసాయన ఔషధాలతో నాగార్జునుడు ఐదు శతాబ్దములు జీవించాడు. ఆ మహానుభావుడు రసగుళికను సిద్ధింప చేశాడు. అది నోటిలో నున్నంత కాలం, శరీరాన్ని ఖండ, ఖండాలుగా నరికినా మరణించలేము. అలసట, ఆకలి, దాహములుండవు... ఆకాశములో లంఘించగలశక్తి సిద్ధిస్తుంది. 'రసగుళిక' ఎన్నో వనమూలికలతో రసాయనిక ద్రవ్యాలతో చేయబడుతుంది. నేను సాధించినది స్వల్పాతి స్వల్పము మహారాజా! ఆ బ్రాహ్మణులు ఇంతటి మహా గ్రంథము సహాయముతో 'స్వర్ణసిద్ధి'ని పొందడములో ఆశ్చర్యములేదు'' అని దీర్ఘ నిస్వనము వదిలారు ఆచార్యులు.

మహామంత్రీ, మహారాజుముఖాలు చూసుకున్నారు. మహామంత్రి మరుసటి రోజు జరుగబోవు నిందితుల విచారణ గురించీ తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ ఆచార్యులకూ మహారాజుకూ వివరించాడు. ముగ్గురూ మరికొంత కాలము చర్చించిన తరువాత ఆ సమావేశము ముగిసింది.

* * *


మరునాడు మహారాజు సభ తీర్చాడు.

నవరత్న ఖచిత సింహాసనముపై ప్రతాపరుద్ర చక్రవర్తి ఆసీనులైనారు. ఆయనకు ఎదురుగా వామపక్షమున వివిధ శాఖల మంత్రులూ, ఉప మంత్రులూ, వారికెదురుగా సేనాధిపతీ, ఉప సేనాలూ, దండనాయకులూ, వివిధ ప్రభుత్వోద్యోగులూ ఆసీనులై యున్నారు. మహారాజు కిరువైపులా మహామంత్రీ, ఆచార్యుల వారూ ఆసీనులైనారు. సభ కిటకిట లాడుతున్నది.

మహారాజు ఆజ్ఞ ప్రకారము బంధితులైన ఖైదీలను సభలో ప్రవేశపెట్టారు రాజభటులు. ఆస్థాన ధర్మకర్త లేచి మహారాజుకూ సభకూ నమస్కరించి తన తీర్మానాన్ని అందరికీ వినిపించేట్లు బిగ్గరగా చదివాడు. అందులో నిందితులు దొంగ నాణెములు సృష్టించారన్న నేరము మాత్రమే వివరింపబడినది. వారు చేసిన 'స్వర్ణ యోగము' శ్లేషింపబడలేదు. ప్రజలకు దాని గురించి తెలుపకూడదనే మహామంత్రి సంహా పాటించబడినది. ధర్మకర్త ఆ బ్రాహ్మణులలో ఒకరికి మరణ దండన, మరొకరికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఎవరికి ఏ శిక్ష అమలు జరుపాలో తెలుపలేదు. కారణం ఆ ఖైదీలు తండ్రి కొడుకులు కావడమే.

మహామంత్రీ ఆచార్యుల వారు కొన్ని క్షణాలు మంతనాలు జరిపారు. తరువాత మహామంత్రి సభనుద్దేశించి ప్రసంగించిన అనంతరం నిందితులతో "ఓ బ్రాహ్మణులారా బ్రహ్మ హత్య మహాపాతకమని మాకు తెలుసు. కాని శిక్షాస్మృతి అందరికీ వర్తిస్తున్నది. వీరు చేసిన నేరము దేశానికి గొడ్డలి పెట్టువంటిది. వీరిలో ఎవరికి మరణ దండన వేయాలో ఎవరికి కారాగార శిక్ష విధించాలో వీరే నిర్ణయించుకోండి" అని గంభీరంగా పలికి తన స్థానములో ఆసీనులయ్యారు.

సభలో నిశబ్దం అలుముకుంది. నిందితుడైన వృద్ధ బ్రాహ్మణుడి ముఖములో



ఎలాంటి మృత్యు భయమూ లేదు. ప్రక్కనే అతని సుపుత్రుడు మౌనముగా రోదిస్తున్నాడు.

ఒకసారి సభనంతా - వీక్షించి ఆచార్యులవారిని తీక్షణముగా చూసి నిశబ్దాన్ని చీలుస్తూ ఆ వృద్ధ బ్రాహ్మణుడు మహారాజు నుద్దేశించి అన్నాడు "మహారాజా! నాపేరు మాధవాచార్యులు, ఇతడు నా సుపుత్రుడు కృష్ణమాచార్యులు. మీరు మాపై ఆరోపించిన నేరము సభా సదులకు పూర్తిగా వివరించక పోవడము సబబైనదే. ఈ శిక్షలో తుది నిర్ణయము మాకే వదిలినందుకు, ధర్మకర్తకూ, మహారాజుకూ, మంత్రి వర్యులకూ, ముఖ్యముగా ఆచార్యుల వారికీ కృతజ్ఞతాభి వందనములు. ఈ మరణదండన నా కుమారునికి విధించండి. కారాగార శిక్ష నాకు విధించండి!" అని తలవంచుకున్నాడు.

సభ స్తంభించి పోయింది. ఆ వృద్ధ బ్రాహ్మణుడే మరణ శిక్షను అనుభవిస్తాడనుకున్నారంతా. దానికి విరుద్ధముగా అతడు తన కుమారున్నే బలికోరడము ఆనాటి సభాసదులందరికీ అనూహ్యమైన విషయమైనది. సభలో గోల మొదలయింది. క్రమముగా పెరగసాగింది. వివిధ రకముల వ్యాఖ్యానాలు. కొందరి శాపనార్థాలు. గోల గోలగా పరిణమించింది సభ. ఇంతలో ధర్మగంట గణగణా మ్రోగింది. సభలో తిరిగి నిశ్శబ్దము ఆవరించింది.

రాజభటులు వృద్ధ బ్రాహ్మణున్ని కారాగారం వైపు, అతని పుత్రుని వధ్యస్థలమునకు తీసుకుపోయారు.

సభలోని వారు హా! హా? కారాలు చేశారు.

మహారాజు సింహాసనము నుండి లేచారు. సభ చాలిస్తున్నట్లు ప్రకటించబడింది. అందరూ నిష్క్రమించాక మహారాజా, మహామంత్రీ ఆచార్యుల వారిని సమీపించారు. ఆయన తల వంచుకుని ధ్యానములో నున్నట్లుండి వారి ఉనికిని కూడా గ్రహించకుండా ఆలోచనా సముద్రములో మునిగిపోయారు. మహామంత్రి ఆయన భుజాన్ని ఆప్యాయంగా తడిమారు. ఇద్దరూ సమాన వయస్కులు. ఆచార్యులు ఉలిక్కిపడి తలెత్తారు. ఆయన కళ్ళు ఆర్ద్రమై ఉన్నాయి. "క్షమించండి ఆచార్యా! బ్రాహ్మణ వధ తప్పలేదు. మీ ఆదేశానుసారమే ఇద్దరికీ మరణదండన విధించలేదు. కాని అతడు తన కుమారున్ని బలి చేయడమే మాకు అర్థం కాలేదు" అన్నాడు మంత్రి మందహాసము చేస్తూ. ఆ క్షణములో ఆచార్యుల హృదయములో చెలరేగుతున తుఫాను వారికెలా తెలుస్తుంది? లేచి మహామంత్రివైపు విషాద దృక్కులు సారించారు.

"మీరన్నట్లు ఆ బ్రహ్మణుడు మా వంశస్తుడే కావచ్చు. కాని నా దుస్థితిని గాంచి అతడా నిర్ణయము తీసుకున్నాడు"

"ఆశ్చర్యముగా ఉంది! మీరు చెప్పేది మా కర్థము కావడము లేదు ఆచార్యా! కాస్త వివరించండి" అన్నాడు మహారాజు.

"రసమారణము" (పాదరసమును లోహముగా మార్చడము) మహా పాపమని


శాస్త్రాల్లో వ్రాయబడింది మహారాజా! స్వర్ణ విద్య నభ్యసించి ప్రజోపయోగమునకు దానిని వినియోగించక స్వార్థానికి వినియోగించి నా పితృదేవులు, పితామహులు మీ పితామహుల కరవాలములకు, కారాగారాలకు గురైనారు. తన సంతానానికి ఆ దుర్గతి కలుగకుండా ఆ బ్రాహ్మణుడు తన కుమారున్ని బలి ఇచ్చాడు. ఆ వృద్ధ బ్రాహ్మణునికి పౌత్రులున్నారు. తన కుమారుడు వారికీ విద్య నభ్యసింపచేయకుండా మరణ దండనకు గురిచేశాడు. ఒక వేళ తనే మరణిస్తే తన కుమారుడు ఎలాగూ తన పుత్రులకు స్వర్ణ విద్యని ప్రసాదిస్తాడు. చివరకు వాళ్ళూ నాశనమౌతారు. ఆ విధముగా వంశ నాశనము జరుగకుండా కాపాడాడు. వారికే ఆధారము లేకుండా ఆచార్య నాగార్జునుడు వ్రాసిన ఆ గ్రంథమును మనకు సమర్పించాడు. ఇప్పుడు ఆ వృద్ధునితోనే ఆవిద్య అంతరిస్తుందని మనం ఊహించవచ్చు" అని భారముగా నిట్టూర్చాడు ఆచార్యులు.

"ఆచార్యా! మీరు తమది దుష్టిగా వివరించారు కారణము ఊహించకుండా ఉన్నాము" అన్నాడు మహారాజు. క్షణం మౌనం తర్వాత వారిరువురివైపూ విషాద దృక్కులు సారించారు ఆచార్యులు.

"నేను నా పిల్లలకు ఈ విద్య గరపనంత వరకూ నా స్థితి మీకుతెలుసు— ఆ ఉద్దేశము లేకున్నా మీరు తీసుకొంటున్న జాగ్రత్తలూ నాకు తెలుసు. మహారాజా! బాల్యమునుండీ మమ్మల్నీ చూస్తున్నారు.... నేను బ్రతికినంత కాలము మన రాజ్యం కోసం కృషి చేస్తాను... ఈ విద్య నాతోనే అంతరిస్తుంది! ఆ తర్వాత 'రసతంత్రము' మీ ఆస్థానములోనే ఉంటుంది కదా! ...." అన్నాడు ఆచార్యులు భార హృదయముతో.

మహారాజు ఆచార్యులను భావోద్రేకములో కౌగిలించుకున్నారు. మహారాజును ఆశీర్వదించారు ఆచార్యులు. వారిరువురి వద్ద సెలవు తీసుకొని సభా స్థలి వదలి అశ్వశకటము నధిరోహించారు ఆచార్యులు. పారిపోతున్న విధముగా సాగిపోతువ్నది శకటము. తనను అనుక్షణం ఒక వేగుడు గమనిస్తుంటాడనీ... తానూ ఒక బంధితుడేననీ ఆయనకు తెలుసు. కాని ఎందుకో మబ్బులు విడివడిన నీలాంబరమువలె ప్రశాంతముగా ఉందాయన మనస్సు.

ఆ రోజు జరిగిన సంఘటన ప్రజలు చిత్రాతిచిత్రములుగా, కథలు కథలుగా చెప్పుకున్నారు.



### మరుపు

మతిమరుపు మాధవరావు సినిమా హాలు గేటు దగ్గర నిలుచున్నాడు.

"ఏమిటండీ మాధవరావుగారు సినిమాకి వెళ్తున్నారా? వస్తున్నారా?" అప్పుడే సినిమాకి వచ్చిన సత్యం అడిగాడు.

"భలేవారే... అదే గుర్తొస్తే ఇక్కడెందుకు నిలుచుంటాను" చెప్పాడు మాధవరావు.

అచ్యుతుని రాజ్యశ్రీ (హైదరాబాద్)